సాక్షి
శ్రీకాకుళం

I

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



న్యూస్‌రీల్

ఉపాధి పనులు భేష్


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ అశోక్

జి.సిగడాం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ, రికార్డుల పనితీరు ఎంతో సంతృప్తిగా ఉన్నాయని రాష్ట్ర జాయింట్ కమిషనర్ ఎం.అశోక్ అన్నారు. సీతంపేట, జి.సిగడాం గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా చేపట్టిన పనులకు తప్పని సరిగా బోర్డులను ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలన్నారు. మొక్కలు, తోటల పెంపకంపై మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి రికార్డును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఓడీ నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ వెంకటాచలం

శ్రీకాకుళం: విశాఖపట్నంలో ఈనెల మూడో వారంలో జరిగిన ఆప్తమాలజీ కాన్ఫరెన్స్ (ఎపిఓఎస్-ఎపీఓఎస్) 2023లో శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. సైంటిఫిక్ కమిటీ నిర్వహించిన క్విజ్ పోటీల్లో మొదటి మూడు బహుమతులు శ్రీకాకుళం ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులు వై.సౌమ్యప్రియ, రేష్మ, వై.సుష్మకాంతిలు కైవసం చేసుకున్నారు. వీరిని ఆప్తమాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ నిర్మల జ్యోతి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం అభినందించారు.

ప్రత్యేక లోక్‌అదాలత్‌లో 21 కేసులు పరిష్కారం


ప్రత్యేక లోక్ అదాలత్‌లో జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రత్యేక లోక్ అదాలత్‌లో 21 మోటార్ ప్రమాద కేసులను పరిష్కరించినట్లు జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శ్రీకాకుళం కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఇన్సూరెన్స్ కంపెనీలు 21 కేసుల్లో కక్షిదారులకు రూ 67.45 లక్షల పరిహారం చెల్లించేందుకు రాజీ కుదుర్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కోడ్ జడ్జి, మూడో అదనపు జిల్లా భాస్కరరావు లోక్ అదాలత్‌లకు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా, న్యాయవాది వేమూరి హరిప్రియ, కార్యదర్శి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, గేదెల ఇందిరా ప్రసాద్ న్యాయవాది లోక్‌అదాలత్ మెంబర్లుగా వ్యవహరించారు.

'వెంకటాపురం'గా నామకరణానికి తీర్మానం

కంచిలి: మండలంలోని జలంత్రకోట పంచాయతీ పరిధిలో గల ఉప్పరిపేట గ్రామానికి 'వెంకటాపురం' అనే కొత్త పేరును పెట్టుకుంటామని స్థానికులు చేసిన విన్నపానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు గ్రామంలో మండల రెవెన్యూ అధికారులు శనివారం గ్రామసభను నిర్వహించారు. ఈ ఊరి పేరును గ్రామస్తులందరి అంగీకారంతో 'వెంకటాపురం'గా నామకరణం చేయడానికి తీర్మానించారు. ఈ గ్రామసభలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బి.అపర్ణ, వీఆర్వో కృష్ణారావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.సర్వేశ్వరరావు, గ్రామస్తుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జెల మాధవరావు, నక్క ఢిల్లీరావు, జలసూత్ర లచ్చయ్య, నక్క కాశీరావు, లక్ష్మీనారాయణ, జయరాం పాల్గొన్నారు.

ఆల్ టైమ్ రికార్డ్

- జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఇప్పటివరకు 1.76 లక్షల మందికి వైద్యపరీక్షలు
- 172 రకాల మందులు పంపిణీ
- మెరుగైన చికిత్సలకు నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్

అరసవల్లి:

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఊరూరా ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రికార్డు స్థాయిలో జనాలకు వైద్యం చేశారు. గత నెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సేవలందించేలా హెల్త్ క్యాంపులను వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించేలా షెడ్యూల్‌ను అమలు చేస్తున్నారు. రికార్డు స్థాయిలో ఏకంగా ఇప్పటివరకు (గత నెల 30 నుంచి ఈనెల 19 వరకు) ఓపీ ద్వారా 1,76,948 మంది వరకు రోగులకు వైద్య సేవలందించి ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో కంటి స్క్రీనింగ్ పరీక్షలను ఇప్పటివరకు 29,880 మందికి చేయించారు. అలాగే మెరుగైన ఉన్నత వైద్యానికి గాను ఇప్పటివరకు 3835 మందికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశారు. అలాగే వాళ్ల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ తెలుసుకుంటూ ఫాలోఅప్ చేస్తున్నారు.

సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

ఇప్పటికే మెడికల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల వారీగా గత నెల 16 నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి.. బీపీ, సుగర్, హిమోగ్లోబిన్, టీబీ, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి కేస్ షీట్స్ సిద్ధం చేసింది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని గుర్తించి వారి వివరాలను యాప్‌లో నమోదు చేశారు. అలాగే వీరికి ప్రత్యేక కూపన్లను అందించారు. వీటి ద్వారా హెల్త్ క్యాంపుల్లో వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఇటీవల వచ్చిన మార్గదర్శకాల ప్రాప్తికి కూపన్లు లేకున్నా కూడా వైద్య సేవలు కొనసాగించేలా చర్యలు చేపట్టారు. మెరుగైన చికిత్స అవసరమైతే వైద్యులు సమీపంలో ఆస్పత్రికి తరలించి ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైనా ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తారు. రోగులు కోలుకునే వరకు పర్యవేక్షించేలా ఫ్యామిలీ డాక్టర్, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో అనుసంధానం చేశారు.


సారవకోట: బుడితిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో చిన్నారికి వైద్య సేవలు

ఇప్పటివరకు నిర్వహించిన హెల్త్ క్యాంపులు	480
అవుట్ పేషెంట్లు	1,76,948
రిఫరల్ పేషెంట్లు	3835

ఇంటింటి సర్వేలో రోగుల సమాచారం ఇలా..

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	జనాభా	జ్వరాలు	బి.పి	మధుమేహం
669	10,93,899	39,699	14,589	24,510
థైరాయిడ్	**గుండె జబ్బు**	**కిడ్నీ**	**క్యాన్సర్**	**పక్షవాతం**
1886	1013	1208	488	95435

కంటి జబ్బులు	దంత సమస్యలు	ఎడోలసెంట్	దగ్గు	రక్తహీనత చర్మ సమస్యలు
5752	928	8210	802	130

ఇంత అద్భుత సేవలు చూడలేదు



జగనన్న ఆరోగ్య సురక్ష కింద పేద, సామాన్య ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించడం నిజంగా అద్భుతం. నా సర్వీస్‌లో ఇలాంటి వైద్య సేవల కార్యక్రమాన్ని చూడలేదు. 30 మండలాల్లో మొత్తం 607 వైద్య శిబిరాలను ఏర్పాటు కు చర్యలు చేపట్టాం. ఇప్పటివరకు కంటి స్క్రీనింగ్ టెస్ట్‌లతో కలిపి 1.76 లక్షల మందికి వైద్య సేవలందించి రికార్డు సృష్టించాం. ఇంకా మెరుగైన వైద్యం కోసం 3,835 మందికి నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేశాం.

– డాక్టర్ బి.మీనాక్షి, డీఎంహెచ్‌ఓ

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో..

గ్రూప్–1, 2 ఉద్యోగ పరీక్షలపై
ఉచిత అవగాహన సదస్సు

- నవంబర్ 4వ తేదీన శ్రీకాకుళంలో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్–1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో..గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్–1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెలిసిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గ్రూప్1, గ్రూప్ 2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం తోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నంబర్‌కు తమ పేరు, ఫోన్ నంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ:
నవంబర్ 4, 2023(శనివారం)

వేదిక:
సెమినార్ హాల్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ (అటానమస్) ఫర్ ఉమెన్, శ్రీకాకుళం

సమయం:
ఉదయం 09:30 నుంచి 12:30 వరకు.

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్: 8977625795

● శక్తిస్వరూపిణి




అవలింగిలోని నీలమణి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని శనివారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. సుమారు రూ.70 వేల కరెన్సీ నోట్లతో అలంకరించి ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. శ్రీకాకుళంలోని నానుబాలవీధిలో కొలువైన విజయదుర్గమ్మను దుర్గాదేవిగా అలంకరించారు.

– సారవకోట, శ్రీకాకుళం కల్చరల్

పెద్దపులి సంచారం

- ఏఓబీలో పెద్దపులి అలజడి
- ఒడిశా అధికారుల సీసీ కెమెరాల్లో కనిపించిన పులి కదలికలు
- పలాస, మందస, మెళియాపుట్టి మండలాల్లో అప్రమత్తత


ఒడిశా అధికారుల సీసీ కెమెరాలో కనిపించిన పులి

కాశీబుగ్గ: మహేంద్ర గిరి పాదాల చెంతన ఆంధ్రా ఒడిశా సరిహద్దులో అరుదైన పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఒడిశా గజపతి జిల్లా రాయగడ బ్లాక్‌లో ఉన్న సంతోషిపురం గ్రామంలో పెద్దపులి సంచరించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మొదట దీన్ని పుకారుగా అంతా కొట్టిపడేశారు. అయితే ఈ నెల 19న అర్ధరాత్రి అదే గ్రామంలో ఓ ఆవును ఈడ్చుకుపోయిన చంపి తినేయడంతో పెద్ద పులి తిరుగుతోందని స్థానికులు నిర్ధారణకు వచ్చారు. గిరిజనులు వేటకు కూడా దిగిపోయారు. ఫారెస్టు సిబ్బంది ఉన్నతాధికారులకు విషయం చెప్పడంతో వారు అప్రమత్తమయ్యారు. శుక్రవారం, శనివారం ఆంధ్రా–ఒడిశా సరిహద్దులు పంచుకునే పలాస మండలం లొత్తూరు, వరహాలగెడ్డ రిజర్వాయర్, మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామాల సమీపంలో పులి సంచరించినట్లు అక్కడి రైతులు చెప్పారు. దీంతో ఒడిశా, ఆంధ్రా ఫారెస్టు అధికారులు గొప్పిలి చేరుకుని గండాహతి వెళ్లే పర్యాటకులను హెచ్చరించారు. ఒడిశా ఫారెస్టు అధికారులు అమర్చిన సీసీ ఫుటేజీలలో పెద్దపులి చిత్రాలు కనిపించడంతో పులి తిరుగుతున్నట్లు నిర్ధారణ జరిగింది. దీంతో రెండు రాష్ట్రాల అధికారులు బోర్డర్‌లో ఉన్న లావణ్యకోట, గారబంద, రంప, గొప్పిలి, కంట్రగడ, లొత్తూరు, సందూరు గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పులి సంచారంపై కాశీబుగ్గ ఫారెస్ట్ రేంజర్ మురళీకృష్ణ నాయుడును వివరణ కోరగా పెద్దపులి ఒడిశాలో తిరుగుతున్న విషయం వాస్తవమేనని, దాని అడుగులు, ఆవును తిన్న స్థలంలో పులి వెంట్రుకల ఆధారంగా ఒడిశా అధికారులు నిర్ధారించారని చెప్పారు. పెద్దపులి దిశను మార్చుకుని ఆంధ్రాలో అడుగుపెట్టిందని కాశీబుగ్గ రేంజ్ పరిధిలో ఉన్న పలాస, మందస మండలాలను అప్రమత్తం చేశామని తెలిపారు.


సందూరు గ్రామస్తులకు పులి సమాచారం అందిస్తున్న కాశీబుగ్గ ఫారెస్టు అధికారులు

రూ. 167 కోట్లు స్త్రీ నిధి రుణాలు లక్ష్యం

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రుణలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో రూ.167 కోట్ల స్త్రీనిధి రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని ఏజీఎం వి.సత్యనారాయణ అన్నారు. మండలంలో గల మహిళ సమాఖ్య భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 15,900 మంది సభ్యులకు రూ.99.15 కోట్లు రుణాలు అందించామని అన్నారు. ప్రధానంగా వ్యవసాయం, చిరువ్యాపారులు, కులవృత్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంక్ రుణాలతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న సభ్యులకు 48 గంటల్లోనే సప్లిమెంటరీగా స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. గతంలో ఐదుగురు సభ్యులకు రూ. 3–5 లక్షలు రుణం ఇస్తే వాటిని నవంబర్ నుంచి రూ. 10 లక్షలకు పెంచామని తెలిపారు. అలాగే గ్రూప్ గ్రేడ్‌లను బట్టి రూ.75 లక్షల వరకు రుణాలు ఇస్తామన్నారు. రుణాలకు సంబంధించిన లావాదేవీలు అన్నీ సాంకేతిక పరిజ్ఞానంతోనే జరుగుతున్నాయని, ఎలాంటి దుర్వినియోగానికి అవకాశం లేకుండా పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలానికి ఇప్పటికి రూ. 10 కోట్లు రుణం అందిస్తే రికవరీ 94 శాతం అయిందన్నారు.

సెలవు రోజుల్లోనూ విద్యుత్ బిల్లుల చెల్లింపు

అరసవల్లి: ఈనెల 22, 23, 24 తేదీల్లో సెలవు రోజులు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు విద్యుత్ కార్యాలయాల్లో కలెక్షన్ కౌంటర్లు తెరిచే ఉంటాయని సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలియజేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ఈ కలెక్షన్ కౌంటర్లు సెలవు రోజుల్లోనూ అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బస్సుయాత్ర విజయవంతం చేయండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సామాజిక న్యాయ బస్సుయాత్ర విజయవంతం చేయాలని కోరుతూ విజయనగరంలో ఉత్తరాంధ్ర దళిత నాయకులతో శనివారం ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి తెలియజేయాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి, యజ్జల గురుమూర్తి, మెరక సూర్యనారాయణ, నల్ల బారికి శ్రీనులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

సోమవారం స్పందన లేదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న స్పందన విజయ దశమి కారణంగా ఈ సోమవారం నిర్వహించడం లేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

నేటి నుంచి బహడపల్లిలో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు

మందస: మండలంలోని ఉద్దాన ప్రాంతమైన బహడపల్లిలో ఈ నెల 22, 23 తేదీల్లో జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్టు గ్రామస్తులు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. శ్రీచండేశ్వరి గ్రామదేవత ఆశీస్సులతో విజయదశమి సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులుగా రూ.10,016లు, రూ.8,016లు, రూ.5,016లు, రూ.5,016లతో పాటు షీల్డ్ కూడా అందజేస్తామని తెలిపారు. బెస్ట్ రైడర్, బెస్ట్ డిఫెండర్, బెస్ట్ ఆల్‌రౌండర్లకు షీల్డ్, నగదు అందజేస్తామన్నారు. నిబంధనల ప్రకారం జరిగే ఈ పోటీలకు సంబంధించి మరిన్ని వివరాలకు నిర్వాహకులను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆక్రందన దీక్షలో ఆయన పాల్గొన్నారు. తాము పంపిన ప్రతిపాదనలు చాలాకాలంగా పెండింగ్‌లో ఉండిపోయాయని, వాటిని పరిష్కరించాలన్నారు.

పండగ ఆఫర్.. వ్యాపారం సూపర్

- మార్కెట్‌కు దసరా కళ
- దుస్తుల నుంచి వాహనాల వరకు అన్నింటిపైనా ఆఫర్లు
- జోరుగా కొనుగోళ్లు

శ్రీకాకుళం కల్చరల్: మార్కెట్‌కు దసరా కొత్త కళ తెచ్చింది. టూత్ పేస్టు నుంచి టూ వీలర్ వరకు అన్నింటిపైనా ఆఫర్లు ప్రకటించడంతో కొనుగోలుదారులు ఎగబడుతున్నారు. దీంతో జిల్లావ్యాప్తంగా మార్కెట్లు కళకళలాడుతున్నాయి. మధ్యతరగతి వాళ్లు కూడా ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు, టూవీలర్ల కొనుగోలుకు ముందుకు వస్తుండడంతో అందుకు తగ్గట్టుగానే ఆయా కంపెనీలు కూడా పండగ ఆఫర్లను ప్రకటిస్తున్నాయి. దీనికి తోడు ఫైనాన్స్ సదుపాయం కూడా కల్పిస్తుండడంతో వస్తువుల విక్రయాలు జోరందుకుంటున్నాయి. కొన్ని షాపుల్లో ఫైనాన్సు కంపెనీల ప్రతినిధులు మధ్యవర్తులుగా ఉండి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.



శ్రీకాకుళంలోని ఓ షాపులో కొనుగోలుదారుల సందడి

ఆఫర్లతో ఆకర్షణ

వినియోగదారులను ఆకర్షించేందుకు పలు కంపెనీలకు చెందిన వ్యాపారులు తమ వస్తువులు కొనుగోలు చేస్తే డిస్కౌంట్ ఇస్తామని, మనీబ్యాక్ ఇస్తామని ప్రకటిస్తున్నారు. స్క్రాచ్‌కార్డులు కూడా ఇస్తున్నట్టు ప్రకటిస్తున్నారు. దీంతో కొనుగోలు దారులు వీటి కొనుగోళ్ల కోసం ముందుకు వెళ్తున్నారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు కూడా తమ క్రెడిట్ కార్డులు వాడితే క్యాష్ బ్యాక్ ఆఫర్లు అందిస్తున్నాయి.

బిజీ బిజీగా షాపులు

దసరా సందర్భంగా అన్ని రకాల దుకాణాలు బిజీబిజీగా కనిపిస్తున్నాయి. స్టాకు తెప్పించుకోవడం, వాటిని మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అన్ని రకాల మోడళ్లను కొనుగోలు దారుల ముందు ఉంచేందుకు సిద్ధపడుతున్నారు.

టూవీలర్స్ కొనుగోళ్లు

దసరా సందర్భంగా ఎక్కువ మంది టూవీలర్స్, ఫోర్ వీలర్స్ కొనుగోళ్లకు ఇష్టపడతారు. అందుకు తగ్గట్టుగా కొన్ని ఆఫర్లు ప్రకటించడంతో వాటిపై ఆశతో జీరో పర్సంట్ ఇంటరెస్టుతో రుణాలను తీసుకొని కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో ఆ షాపుల వద్ద రద్దీ కనిపిస్తోంది.

మీ త్యాగం అమరం



స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక ఇతర అధికారులు

- పోలీసులు నిస్వార్థ శ్రామికులు
- అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత
- స్పీకర్ తమ్మినేని సీతారాం
- ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం

శ్రీకాకుళం క్రైమ్ :

ప్రజల కోసం అనునిత్యం పనిచేస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం అమరమని, వారిని స్మరించుకోవడం అందరి బాధ్యత అని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా స్పీకర్ తమ్మినేని సీతారాం, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, జాయింట్ కలెక్టర్ నవీన్, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనాలు ఎస్పీతో కలిసి పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జిల్లా ఆర్మ్‌డ్ పోలీసు సిబ్బంది పరేడ్ నిర్వహించి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా స్పీకర్ తమ్మినేని మాట్లాడుతూ మాతృభూమి శ్రేయస్సు కోస పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులేనని అన్నారు. అమరవీరుల కుటుంబాలకు శాసన సభాపతిగా, ప్రభుత్వపరంగా అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తామన్నారు. నేరం ఏ స్థాయిలో ఉన్నా, నేరం చేసే వ్యక్తి ఏ స్థాయివారైనా చర్యలు చేపట్టాలని అంటూనే ఆ విషయంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ముందంజలో ఉన్నారని కొనియాడారు. సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని పోలీస్ రిక్రూట్‌మెంట్ జరిగితే వారిపై పని ఒత్తిడి తగ్గుతుందని ఆ దిశగా ఆలోచిస్తున్నామన్నారు. పౌరులు కూడా పోలీసు వ్యవస్థకు సహకరించాలని సూచించారు. యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదన్నారు.

కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ పోలీసు సేవలు అభినందనీయమని, దేశ చరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్ట దినంగా భావిస్తున్నామన్నారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, ప్రజల కోసం ప్రాణాలర్పించిన వారిని స్మరించుకోవడమే మనం వారికి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తరఫున ఎలాంటి సాయం కావాలన్నా అండగా ఉంటామన్నారు. ఉత్సవాలు, కోవిడ్ కట్టడి, శాంతి భద్రతల పరిరక్షణ, అంతర్గత భద్రత, మావో ప్రభావిత ప్రాంతాల్లో అందించిన సేవలు మరువలేనివన్నారు.

ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఇది ఓ భావోద్వేగ దినమని అన్నారు. పోలీసులం విధి నిర్వహణే పరమావధిగా భావిస్తామని అన్నారు. జిల్లా పోలీసు శాఖ తరఫున వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేసిన ఐదుగురు పోలీసులు ఎస్.బంగారునాయుడు, ఎ.పాపారావు, ఎం.నరేంద్ర దాస్, ఎం.వెంకటరమణ, పి.కృష్ణమూర్తిలు ప్రత్యర్థుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారని, వారి సేవలు గుర్తు చేసుకోవడం మన బాధ్యత అని అన్నారు. వారి త్యాగాలను కీర్తిస్తూ వారి కుటుంబసభ్యులను సత్కరించారు. ఈ ఏడాది జిల్లాకు చెందిన తొమ్మిది మంది విధి నిర్వహణలో వీరమరణం పొందారన్నారు. జిల్లా పోలీసు శాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమరవీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణత్యాగం చేసిన 188 అమరవీరుల (ఇందులో మన రాష్ట్రం నుంచి ఒకరున్నారు) పేర్లున్న పుస్తకాన్ని ఎస్పీ రాధిక స్పీకర్ తమ్మినేనికి, వేదికపై ఆశీనులైనవారికి అందజేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్పీ వి.ఎస్.మణికంఠ, డీఎస్పీలు యర్రగుంట శృతి, డి.బాలచంద్రారెడ్డి, జి.నాగేశ్వర రెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిధులున్నాయి.. పనులు చేయండి

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాల్లో చైర్‌పర్సన్ విజయ పిలుపు

అరసవల్లి: నిధులు దండిగా ఉన్నాయని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయ పిలుపునిచ్చారు. ప్రతి మండలానికి రూ.60 లక్షల చొప్పున పనులను గుర్తించి స్థానిక ప్రజాప్రతినిధుల సిఫారసుల ప్రాప్తికి.. ప్రతిపాదించిన పనుల మంజూరుకు చర్యలు చేపట్టాల ని అధికారులను ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. సమావేశాల్లో భాగంగా 1వ, 2వ, 4వ,7వ స్థాయీ సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. వైద్యారోగ్యశాఖ, పరిశ్రమలు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ పనులు, ఆర్అండ్‌బీ, జలవనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల ప్రగతిపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా పరిపాలన సాగిస్తోందని, అలాంటి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టను మరింత పెంచేలా అధికారులు పనిచేయాలని ఆమె సూచించారు. అలాగే అంతకు ముందు 3వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ పాలిన శ్రావణి, 6వ స్థాయీ సంఘ సమావేశానికి వైస్ చైర్‌పర్సన్ సిరిపురపు జగన్మోహనరావు, 5వ స్థాయీ సంఘ సమావేశానికి జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వీరఘట్టం జెడ్పీటీసీ జంపు కన్నతల్లి అధ్యక్షత వహించి పలు ప్రభుత్వ శాఖల ప్రగతిని సమీక్షించి పలు సూచనలు చేశారు. హాజరైన పలువురు జెడ్పీటీసీలు తమ పరిధిలోని సమస్యలను ప్రస్తావించి త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. సభ్యులు అడిగిన ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని సభాధ్యక్షులు ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్‌రామన్, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కనే సీఈఓ వెంకట్రామన్

31 వరకు అమరవీరుల స్మారకోత్సవాలు

శ్రీకాకుళం క్రైమ్ : పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఏటా నిర్వహించే స్మారకోత్సవాలు శనివారం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎస్పీ జీఆర్ రాధిక ఆధ్వర్యంలో ఈనెల 31 వరకు జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసుశాఖ సంసిద్ధమైంది. నేటి నుంచి ఈనెల 31 వరకు ఎచ్చెర్లలోని పోలీసు కల్యాణ మండపంలో పోలీసులు ఆయుధాలు, పరికరాలు, సాధనాలు, సాంకేతిక ఉపకరణాలతో ఓపెన్ హౌస్ ప్రదర్శన నిర్వహించి విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తారు. అంతేకాక సబ్‌డివిజన్, సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో కూడా పై విధంగా నిర్వహిస్తారు. నేటి నుంచి ఈ నెల 30 వరకు పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసు అమరుల గ్రామాలు, పట్టణాలు సందర్శించి వారు చదివిన పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి అమరుల ఫొటోలకు నివాళులర్పించడమే కాక గ్రామంలో ఏదైనా పాఠశాల లేదా రోడ్డు తదితర అభివృద్ధి పనులకు అమరులైన వారి పేర్లు పెట్టేలా గ్రామస్తులకు సూచనలు ఇస్తారు. అన్ని సబ్‌డివిజన్లలో వైద్య శిబిరాల నిర్వహణ ఈనెల 24 నుంచి 27 వరకు, విద్యార్థులకు వ్యాస రచన పోటీలు 28న, ఎచ్చెర్ల కేంద్రంగా వైద్యశిబిరాలు 29న జరగడమే కాక డీఎస్పీలు, సీఐలు, పోలీసుల త్యాగాలపై ప్రముఖ వ్యక్తుల ద్వారా ఆన్‌లైన్‌లో సెమినార్‌లు నిర్వహిస్తారు. 30న అమరులైన పోలీసుల కుటుంబాల్లోని ప్రత్యేక విజయాలు సాధించిన వారికి సన్మానం చేసి, వారి సేవలను ప్రశంసిస్తారు. ఈ నెల 31న రాష్ట్రీయ ఏక్తాదివస్‌లో భాగంగా యూనిట్ రన్ (కొవ్వొత్తుల ర్యాలీ) ముగింపు కార్యక్రమం ద్వారా స్మారకోత్సవాలు ముగుస్తాయి.

‘ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది’

శ్రీకాకుళం న్యూకాలనీ, అరసవల్లి: ఉత్తరాంధ్ర అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు పేర్కొన్నారు. శనివారం శ్రీకాకుళం వచ్చిన ఆయన ఆదిత్యుని దర్శనం అనంతరం స్థానికంగా ఓ ప్రైవేటు హోట ల్లో బీజేపీ నాయకులు పదాధికారులతో కలిసి నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జీవీఎల్ విలేకరులతో మాట్లాడుతూ ఆది నుంచి ఉన్న నిర్లక్ష్యం కారణంగానే ఉత్తరాంధ్ర వెనుకబాటుకు గురైందని తెలిపారు. ఐదు కులాల వారు ఓబీసీలో చేర్చాలని కోరారని, వారి కోరిక మేరకు ఇటీవల ఢిల్లీలో జాతీయ బీసీ కమీషన్ పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేశామని వివరించారు. తెలంగాణలో బీసీ జాబితాలో ఉన్న 27 కులాలను జాబితాలో తొలగించారని, వాటిని తిరిగి బీసీ జాబితాలో చేర్చేలా కృషిచేస్తున్నట్టు చెప్పారు. విశాఖపట్నం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలని విజన్–2030తో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలాసీతారామన్‌కు సమగ్ర ప్రణాళికను అందిస్తున్నామని వివరించారు. అంతకుముందు ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు అర్చకుల బృందం గౌరవ స్వాగతం పలికి దర్శనం చేయించారు.



మాట్లాడుతున్న బీజేపీ రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నర్సింహారావు, పక్కనే జిల్లా నేతలు

వలస మత్స్యకారుడు మృతి

రణస్థలం: మండలంలోని జీరుపాలెం గ్రామానికి చెందిన మాగుపల్లి హరిబాబు(52) కుటుంబ పోషణ కోసం కర్ణాటక వలస వెళ్లి అక్కడ మృతి చెందినట్లు ఆ గ్రామ సర్పంచ్ మాగుపల్లి రాముడు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని మంగుళూరు జిల్లాలో గల మలిపి గ్రామంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లి మృతి చెందినట్లు సమాచారం వచ్చినట్లు చెప్పారు. శనివారం ఉదయం అలల ఉధృతికి నీటిలో ప్రమాదవశాత్తు పడి చనిపోయారని చెప్పారు. మృతునికి భార్య రాము, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. దీనిపై అక్కడ కేసు నమోదైనట్లు చెప్పారు.

నేడు అరసవల్లిలో ఎముకల ఖనిజ సాంద్రత ఉచిత పరీక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం జండూ ఫార్మా కంపెనీ వారి సౌజన్యంతో ఉచితంగా ఎముకల ఖనిజ సాంద్రత పరీక్షలు నిర్వహిస్తున్నామని జిల్లా జండూ ఫార్మా ఇన్‌చార్జి రామ్ తెలిపారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రముఖ వైద్యులు పొన్నాన వెంకటరమణమూర్తి, టి.బ్రహ్మాంలు ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్యపరీక్షలను నిర్వహిస్తారని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రకృతి వ్యవసాయంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్ అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి సమీక్షను జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ శ్రీధర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ఎక్కువ విస్తీర్ణంలో క్షేత్రస్థాయిలో రైతులతో తీసుకెళ్లాలని కోరారు. రైతులతో ఆదాయం వచ్చే విధంగా పలు పంటల విధానాలను చేయించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రేవతి, రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹130	₹215	₹ 235